
# నేత్ర రంజని



ఎమ్మెస్సార్. మూర్తి

అంతఃపురంలోకి రాగానే ఇంద్రుడు నేరుగా కాంతా మందిరంలోకి వెళ్లాడు.

అపాటికి అలంకారం ముగించిన శచీదేవి అద్దంలో చివరిసారిగా చూసుకుని మళ్లీ అసహనంతో తల విదిలించింది.

వెనగ్గా వెళ్లిన ఇంద్రుడు శచీదేవి భుజాలను పొదవి పట్టుకుని చెక్కిలిమీద పెదాలు తాకించాడు.

తా మిద్దర్నీ అద్దంలో చూశాడు.

శచీదేవి ముఖంలో ప్రసన్నత లేదు.

"ఏవిఁటి దేవీ... ఏవిఁ టాలోచిస్తున్నావూ?" అంటూ గారంగా అడిగాడు.

"చెప్పనా?"

"చెప్పమనే గదా!"

"ఏవిఁటోనండీ... ఎన్ని ఆభరణాలు పెట్టుకున్నా ఎంత శృంగారించుకున్నా ఏవిఁటో ఇంకా ఏదో వెలితిగా ఉంటోంద."

"సహజమే!"

"ఏవిఁటీ మీ రనే సహజమూ?" ఈసడింపుగా అంది శచీదేవి.

"అది స్త్రీ లక్షణం!"

"మీ మగవారు మరీనూ...ప్రతిదీ స్త్రీ లక్షణం అంటుంటారే గానీ... ఒక్కటీ పురుష లక్షణం అని చెప్పుకోరు."

"ఊఁ..." గాఢంగా కౌగలించుకోబోయాడు ఇంద్రుడు.

కౌగిలి తప్పించుకుంటూ అంది శచీదేవి - "నే చెప్పనా ఎందుకో?"

"అలాగే!"

"పురుష లక్షణం ఒకటే. ఇలా సాయంత్ర మవగానే స్త్రీలను వెతుక్కుంటూ రావడం."

"వచ్చి..." అంటూ చెక్కిలి ముద్దాడాడు.

"అబ్బ... పొండి."

"అదే కార్యక్రమంలోనే ఉన్నాను గదా..."

"అంటే?!?"

"సర్వేంద్రియాలనూ కళ్లలో కేంద్రీకరించి స్త్రీని చూస్తూ స్వ స్వరూపం పొందే ఆనందంలో బాహ్యాంతరాలు మర్చిపోతూ..."

"స్వ స్వరూపం అంటే?"

"బాహ్యాంతరాలు మర్చిపోయిన ఇంద్రియాలకు వృత్తి సారూప్యం పోతే ఇక మిగిలేది ఆత్మ స్వరూపమే గదా!"

"ఓ అదా! మీ ఇంద్రత్వ లక్షణ గ్రంథంలోని మొదటి పాఠం వల్లెవేస్తున్నారల్లే ఉంది."

"అబ్బ! నీ క ళ్లెంత బావున్నాయో... ప్ప వాటిని ము ద్దెట్టుకోవాలంటే రెప్పలు అడ్డం గదా!"

"అన్నట్టు కళ్లంటే జ్ఞాపకం వచ్చింది. 'సర్వేంద్రియాణాం నయనం ప్రధానం' అన్నారు కదా... ఎందు కేవిటండీ!"

"సృష్టిని కొనసాగించే మన్మథు డున్నాడు గదా... అతని బాణాలు చూపుతో తప్ప సంధించబడవు. ఎదుటి వారి కంట్లో తప్ప గుచ్చుకోవు."

"సాయంత్రం నుంచీ ఈ అద్దం ముందు కూర్చున్నాను. నా శృంగారంలో ఏదో ఒక వెలితి. ఆ వెలితి ఏంటో ఇప్పు డర్థ మయింది."

"ఏవిఁటి?"

"సర్వాంగాలూ అలంకరించుకున్నా - ఈ కళ్లు మాత్రం ఇలాగే ఏ ఆభరణం లేకుండా మిగిలిపోయాయి."

"పిచ్చి శచీ - కంటికి ఆభరణం వేరేగా ఏముంటుంది? ఓ మంచి దృశ్యం తప్ప..."

"మీరు మరీనూ... అంత తెలివితక్కువదా న్ననుకున్నారా? చెవికి శబ్దం ఇంపుగా ఉన్నంతమాత్రాన ఇక చెంప సరాలూ, రవ్వల మాటీలూ, కమ్మలూ, దుద్దులూ ఇక అఖర్లే దనుకున్నారా?"

"అంటే... కంటి క్కూడా ఏదైనా ఆభరణం ఉండా లంటావు."

"అవును. మీరు దేవేంద్రులు గదా! మీరు తలచుకుంటే ఏదైనా చేయగలరు!"

"స్త్రీ ప్రకృతి ఇంతేలే!"


"ఏవిఁటీ?"

"మీ రేదైనా చెయ్యగలరని మగాళ్లని పొగడడం. తమ పనులు సాధించుకోవడం."

"అందుకే గదా! ఒంటికి నారి సారించినట్టే ఇంటి క్కూడా నారి సారించాల్సిందే!"

"సారిస్తే మంచిదే. సాధిస్తేనే చిక్కు. అన్నట్టు మాటల్లో పడి మర్చిపోయాను. నేనూ ఓ కొత్త కార్యక్రమం తలపెట్టాను."

"ఏవిఁ టది?"




"అన్ని పనులూ నేనే చేసుకోవడం నానా యాతనగా ఉంది. దేవ గురుని అడిగితే ఓ సలహా ఇచ్చాడు. 'ఏదో ముఖ్యమైన విషయాలు నీ అధీనంలో ఉంచుకుని మిగతా వి చూసుకోవడానికి నీ కిష్టులైన వారిలో ప్రతిష్ఠులను చూసి వారికి యాజమాన్యం ఇవ్వరాదుటయ్యా' అంటూ."

"అప్సరసల దగ్గర్నుండి అంగిరసుడి దాకా మీకు అందరూ ఇష్టులే!"

"అపచారం! అప్సరల మాట అటుంచి అంగిరసుడు ఎవ రనుకున్నావ్? బ్రహ్మద్రష్ట, బృహస్పతి లాంటి కుమారులు... యోగసిద్ధి, సినీవాలి లాంటి కుమార్తెలు..."

"వారి శ్రీమతి శ్రద్ధ - కదా!"

"అవును మరి. ఇలా మన కందరూ ఇష్టులే. ఇక ప్రతిష్ఠులను వెతకాలి."

"ఏఁ ప్రతిష్ఠులో, ఏమో - మొన్న అ దెవరో బోయవాడు అతని పేరు ఏవిఁటన్నారూ - అతని కేదో ఉన్నత పదవి ఇవ్వాలని నాల్రోజులు నిద్ర లేకుండా ఆలోచించారు."

"పింగాక్షుని గురించే కదా ను వ్వనేది? చాలా మంచివాడు. ఎంతో గొప్పవాడు."

"ఇంతకీ ఏమిటండీ అతని గొప్పతనం?"

"పింగాక్షుడు వృత్తి రీత్యా బోయవాడైనా ప్రవృత్తి రీత్యా జీవహింస చేసి

ఎరగడు. దైవ చింతన, ధర్మ పరాయణత తప్ప ఇతరం తెలియదు. ఇక వాళ్ల చిన్నాన్న దారకుడు. తన తోటి బోయవారితో సామాన్య ప్రజలైన మార్గస్థులను కొట్టి వాళ్ల ధనాన్ని దొంగిలిస్తుంటాడు. ఈ దారకుడి బాధలు పడలేక ఓ రోజు కొందరు ఏడుస్తుంటే పింగాక్షుడు వారిని కాపాడడానికి పరుగెత్తుకుని వచ్చి పినతండ్రి దారకుడితోనూ, అతని సహచరులతోనూ తలపడ్డాడు. యుద్ధంలో ఆ బోయలు పింగాక్షుని బాణాలతో కొట్టి దారుణంగా చంపారు."

"పాపం! అంత బలవంతులతో అనవసరంగా ఇత నెందుకు తలపడాలి?" నొచ్చుకుంది శచీదేవి.

"బలం ఉన్నా లేకపోయినా - అధర్మాన్ని సహించకుండా ఎదిరించే వారే కదా నిజమైన ప్రజాహితులు - పౌరులు. ఇదివరకు ఈ ఇంద్ర పదవిని చేపట్టినవారు ఇలాంటివి చేసినా, చేయకపోయినా - నేను మాత్రం ఇలాంటి వారికి తగిన స్థానా న్నిచ్చి - నా పాలనను సమర్థవంతం చేసుకోవాలని నిర్ణయించాను."

"మరి... అతను బోయవాడు కదా - మన దేవతలు ఒప్పుకుంటారా!"

"శచీ! నేను ఇంద్రుడిని. నా శాసనం ధిక్కరిస్తే ఇక ఇంద్ర పదవికి అర్థ మేముంటుంది? అతనికి తగిన స్థానమే నిర్ణయించాను. నరకలోక పాలకుడిగా అత నుంటే బాగుంటుంది, ఏమంటావు?"

"నరకం చాలా దారుణ మట! దా న్నో కంట కనిపెట్టేవాడు మీకు మరింత సన్నిహితుడై ఉండాలి. మంచి పని చేశారు."

"కదా... నేను నియమించబోయే లోకపాలక సలహా సంఘంలో అతను కూడా ఉన్నాడు."

"మిగతా వా ళ్లెవరు?"

"మొత్తం తొమ్మండుగు రున్నార్లే..."

"మీతో పది అనరాదండీ... వా ళ్లెవరూ అని..."

"ఇదుగో... మొన్న సమావేశంలోని చిత్రం - ప్రదక్షిణంగా - అగ్ని ధర్మరాజు... అంటే ఎవరు?"

"అబ్బ... తెల్సులెండి. చూస్తున్నాను గదా చిత్రంలో యమధర్మరాజు..."

"ఆ తర్వాత పింగాక్షుడూ... అంటే నిరృతీ..."

"ఓహో ఇతనేనా... పింగాక్షుడూ... బాబోయ్... కళ్లు ఎంత ఎర్రగా ఉన్నాయో!.ఎంత భయ మేస్తుందో... అయినా ఇంత ఎత్తున్నా డేవిటండీ..."

"అత నంతేలే... ఆ పక్కన వరుణుడూ, పవనుడూ..."

"వీర్ని నేను చూశానులే..." అంటూ ఆనందంతో శచీదేవి కేక పెట్టింది; ఆ తర్వాత వ్యక్తిని చూస్తూ...

"ఆఁ అవును. ఆడవాళ్లకి బంగారం - నగలూ అందచేస్తా డనే కదా ఈ ఆనందం. నీకు తెలీదేమో - కుబేరుడు నాలాగే యక్షులకు రాజు - పైగా పరమశివుడికి మిత్రుడు. ఇక... చివరగా సాక్షాత్తూ శివుడైన ఈశానుడు."

"చాలా బావుందండీ... అంటే మీతో ఎనిమిదిమందే గదా - మిగతా ఇద్దరూ?"

"ఆమాత్రం తెలీదా - జగదాధారమైన భూమి, ఆకాశం."

"వీ రందర్నీ ఓసారి మన అంతఃపురానికి ఆహ్వానించండి."

"అపచారం, శచీ, వారు నా కేమీ తీసిపోరు. ముందు మనమే వెళ్లాం."

"సరే - ఇంతకీ ఈ లోకపాలక సంఘం ఎప్పట్నుంచి అమలులోకి వస్తుంది? నా కెంతో ఉత్సాహంగా ఉంది."


"అసలు చిక్కేమిటంటే - వీ రందరికీ నేతను నేనే అయినా ఎవుడు ఏమేమిటి ఎలా చెయ్యాలో వివరించే నిబంధనలు ఇంకా ఏవీ లేవు. అవి తయారు చేయాలంటే మరో నాయకుడు కావాలంటూ వాళ్లే సలహా ఇచ్చారు. ఇక అతను ఎవరై ఉండాలా అని ఆలోచిస్తున్నాను."

"అదా మీ పరధ్యానం. ఓ పని చేయకూడదూ? వాళ్లకి నచ్చిన వాళ్లని ఎవరైనా వారినే ఎన్నుకోమనండి సరిపోతుంది."

"నీ సలహా బాగానే ఉంది. మొదట పింగాక్షుడినే అడుగుతాను. అటు దేవతలకీ, ఇటు రాక్షసులకీ అతను సన్నిహితుడు గదా!"

# సంగీత సాయంత్రం

పాపయ్య శాస్త్రి



వార్షుక సాయంత్రం వేళ
ఆకాశం అకస్మాత్తుగా సంగీతశాలగా మారుతుంది!
ప్రకృతి మొత్తం తన చిత్తాన్ని
సంగీతోన్ముఖంగా నిలుపుకుంటుంది
ఆకాశంలో తబలాలు, మృదంగాలు
సరి చేసుకుంటున్న చప్పుళ్లు వినిపిస్తాయి!
తంబురా తీగలమీద శృతి కలపడానికి
కోమలాంగుళులు మెరిసిన మెరుపులు కనిపిస్తాయి!
సప్త వర్ణాల శాలువను విలాసంగా ధరించిన నీలాంబరం
సంగీత విద్వాంసుల వేది కౌతుంది!
స్వర సప్తక గమకాల హేలగా సర్వత్రా వినిపిస్తాయి!
అలవోకగా పలికిస్తున్న
హరిప్రసాద్ చౌరాసియా వేణువులా
చిరుగాలులు మంద మందంగా పరుగెడతాయి!
మెత్తని బాలమురళి ఆలాపన వంటి
మనోహరమైన తేమ వాసన
హృదయాన్ని మృదువుగా చుట్టుకుంటుంది!
చిట్టిబాబు వీణ మీటినట్లు
చినుకులుగా మొదలైన వాన
చూస్తూనే రవిశంకర్ సితార్ స్వరాల జల్లవుతుంది!
అంతల్లోనే శివకుమార్ సంతూర్‌లా వేగాన్ని సంతరించుకుంటుంది!
మరి కాసేపటికి జడివానై
అటు యాళ్లా, ఇటు జాకీర్‌ఖాన్‌తో కలసి
మైసూర్ వి. చౌడయ్యా వయోలిన్‌పై
అమ్‌జద్ అలీఖాన్ సరోద్‌పై సహకరిస్తారు.
అన్ని వాద్యాలు లయబద్ధంగా
అన్ని గాత్రాలు శృతి సమన్వితంగా
మిన్నూ మన్నూ ఏకం చేస్తుంటే
భీమ్‌సేన్ జోషీ హై పిచ్‌లో గొంతెత్తినట్లు
స్వర జలపాతాల హోరు వినిపిస్తుంది!
సంగీత వార్షుక సాయంత్రం వేళ
ప్రాణాలు వాన ధారల్లో మమేకం అవుతాయి!
హృదయం ఆనంద రసార్ణవ మవుతుంది.

"ఇంద్రునికి పింగాక్షుని ప్రణామములు."
"రావయ్యా... రా... కూర్చో."
"ధన్యోస్మి. వెన్నుపూస వంగనపుడే వినయంతో పాటు కార్యదీక్షను ప్రదర్శించగలను, ప్రభూ!"
"అంటే నిలబడే ఉండడం నీ కిష్టం అన్నమాట! ప్రసన్నం చేశావయ్యా. నీ ఈ మంచి మాటకు సూచనగా నడుం కట్టి ప్రతి పనీ ఆరంభించాలి అంటూ ప్రజల్ని ఆదేశిస్తాను."
"ధన్యోస్మి."




"అన్నట్టు మన లోకపాలక యంత్రానికి సూత్రంగా ఎవరుండా లంటావు?"
"యంత్రానికి ఇరుసు ప్రధానం కదా. స్థిరచిత్తం కలవాడై ఉండాలి."
"బావుంది. ఎంతో గంభీరంగా చెప్పావు. ఇతన్ని మనమే ఎన్నుకోవా లంటాను. నీ ఉద్దేశం ఏమిటి?"
"మీ ఉద్దేశమే నాదీను."
"అందరూ కూర్చుంటా నంటారు, నువు నిలబడి నడుం కట్టా నంటావు. లోకాతీతంగా నిలబడిన వాడికే అందరూ కన్పిస్తారు - కనుక అతన్నీ నువ్వే చూడాలి."
"క్షమించండి. నా పాలన నరకలోకం వరకే నని పరిమితం చేశారు గదా!"
"అబ్బెబ్బే అదేం లేదు, నీ ఇష్టం వచ్చినట్టే చెయ్యి, అభ్యంతరం లేదు. చూడు, పింగాక్షా, ప్రజలను పాలించడం మన విధి. ఏ విధి నిర్వర్తించినా అది ప్రజా శ్రేయస్సుకే గదా - నీ ఇష్టం."
"మీ ప్రస్తావన దృష్ట్యా - మొదట 'కార్యదీక్ష' అనుగ్రహించండి."
"అలాగే - ఇంకా?"
"ప్రభూ! సృష్టికి మూలం శృంగారం. దేవతలకీ, రాక్షసులకే కాక సకల ప్రాణికోటి జీవనానికీ మూలమైనదీ, ప్రియమైనదీ శృంగారం. మీకు అభ్యంతరం లేకపోతే సర్వులకూ శ్రేయస్సును కలిగించే ఉద్దేశ్యంతో 'దాన్నే' అడుగుతున్నాను."
ఇంద్రుడు భ్రాంతిలో పడ్డాడు. "ఎలా? కామ సూత్రాలన్నీ మన్మథుడి అధీనం గదా! అ దెలా కుదురుతుంది?"
"క్షమించండి, ప్రభూ! అనంగుడి అదృశ్య ఆశీస్సులతోనే అడుగుతున్నాను."
"పింగాక్షా! మన్మథుడికి ఈ విషయంలో కోపం వస్తే మనం 'గోవిందా' అంటూ వాళ్ల నాన్న దగ్గరికి పరుగెత్తాలి. ఇంతకీ వాళ్ల నాన్నా అమ్మ కూడా అతని ఆధీనంలో ఉండడం నీకు తెలియకపోవడ మేమిటి? అతనికి కోపం వస్తే జగత్తు స్తంభించిపోదా?"

"సావధానంగా వినండి, ప్రభూ! ఒక్కోసారి మన్మథుడికీ, వారి బాణాలకీ మరీ వివక్షత లేకుండా పోయి చివరకు ధర్మం మరచిపోయేంత ఆవేశం కలిగిస్తూ పురుషార్థాల్లోని కామానికి ఈపాటికే రావల్సినంత చెడ్డ పేరు వచ్చింది. నాకు కావల్సింది ఆ సంగతి కాదు. ఆ కామం కాదు. ఆ తర్వాత అవి తెచ్చే క్రోధ సమ్మోహ స్మృతిభ్రంశాలు అంతకంటె కాదు. ప్రజలు అలా నశించడం నా ఉద్దేశం కాదు."
"మ రేవిఁటి?"
"సంతానానికి కీలకమైన సంధానం మాత్రమే! సంసారానికి మూలమైన - సమ్యక్ భోగమైన - సంభోగం మాత్రమే!"
"తథాస్తు! ప్రజల శాంతికీ, ప్రజాభివృద్ధికీ కావలసిన విషయం విడమరచి చెప్పావు. తత్సంబంధిత పాలనకు నీవు ఈ క్షణం నుంచీ అధిపతివి. అంతేకాదు. ప్రజాపతికి తోడుగా ఉంటూ సంతానాన్ని నీవే అనుగ్రహించి వారి ప్రాయంలో పోషించే అధికారం కలిగి ఉంటే దాంపత్యార్థానికి దోహదం చేస్తూ కృతకృత్యుడ వౌతావు."
"మీ అనుగ్రహం" అంటూ వంగకుండానే చిరునవ్వు నవ్వాడు నిర్వృతి.
"నిటారుగా నిలబడి చేస్తున్న నీ సంధాన ప్రసక్తికి ఇక నీవే నాంది."
"ధన్యోస్మి. స్త్రీ పురుషు లిరువురికీ ఇలా నన్ను ప్రీతిపాత్రుడ్ని చేశారు. కృతజ్ఞుడిని."
"పింగాక్షా! మూల కారణాల దగ్గర్నుంచీ చేసిన నీ ప్రస్తావనతో నీ సామర్థ్యాలు బాగా అర్థ మయ్యాయి. అనంగ రంగంలో సంగమించిన దంపతులు మాతాపితరులై, ఆ తర్వాత రహస్యంగా గతిస్తున్న తమ యౌవనాన్ని పిల్లల పోషణలో మర్చిపోతుంటారు. అంటే దాంపత్యం తర్వాత సంతాన సంక్షేమమే ప్రజల మమకారం. ఆ రెండూ నువు చేపట్టావు గనక అందరి మన్ననలూ చూరగొంటావు."
"అంతా దైవానుగ్రహం."




"ఆఁ. అసలు విషయాని కొద్దాము. లోకపాలక యంత్రాని కో ఇరుసు అవసర మన్నావు గదా - అవన్నీ నీవే ఆలోచించి ఓ నివేదికను వెంటనే తయారుచెయ్యి. నేను ఇపుడే శ్రీ లక్ష్మీ నారాయణ దర్శనం చేయవలసి ఉంది. నేను వచ్చేలోగా నివేదిక తయారుకావాలి సుమా!"
"అలాగే ప్రభూ!"

** ** **

"ఏవిఁటి, శచీ, అంత కోపంగా ఉన్నావూ? ఈ ఆగ్రహ మందిరంలో నీ అవతారం చూస్తుంటే - దేవేంద్రుడినైన నాకే భయ మేస్తోంది."
"మీకేఁ? ఎంచక్కా లక్ష్మీ నారాయణ సందర్శనం అంటూ విమానం మీద ప్రయాణాలు చేస్తారు. విమానంలో కూడా కావలసిన విద్యాధరులూ, గంధర్వులూ, అప్సరసలూ - హుఁ. ఎక్కడ ఏం జరుగుతుందో వారి కెలా తెలుస్తుందీ మీకు చెప్పడానికీ?"
"ఏఁ జరిగింది?"
"ఏఁ జరిగిందా?" వెటకారంగా అని, "ఆ దూరదర్శన్ చూసుకోండి. దేవదూతలూ, గూఢచారులూ, యక్షులూ ఏకంగా సంపాదించిన నివేదికలు అలాగే చూసుకోండి."

"వాటిని చూసే ఓపిక నిన్ను చూడగానే పోయింది వెంటనే చెప్పు."

"చెప్పే దేమిటి? అమరావతికే ముప్పు. ఎవరో తపను మొదలెట్టారట!"

"ఎందుకూ?"

"మీ ఇంద్ర పదవి కోసమేమో! అయినా ఇదేం ఖర్మండీ బాబూ - తపన్సు చేస్తే చాలు ఇంద్ర పదవి అంటూ నికషలు పెట్టారూ - ఒకడు ఇంద్రు డవడం, మరొకరు తపనుతో ఎసరు పెట్టడం - శాంతీ లేదూ - సౌఖ్యం లేదు."

"అసంభవం."

"మీరూ అలాగే కదా ఇంద్రులైంది - అది ఎలా సంభవమో ఇదీ అంత వచ్చిగా సంభవమే!"

"అలా జరగడానికి వీల్లేదు."

"అంటే సరిపోదు. ఇలాంటపుడు గత ఇంద్రుళ్లు ఏం చేశారో చూసి - అవి కాకుండా కొత్త పద్ధతి ఏదైనా ఆలోచించండి. మనం శాశ్వతంగా ఉండేట్లు చూడండి."

"హుం. ఏ తపస్వి అయినా మొదట అసలు ఇంద్రియాలు జయిస్తేనే గదా! ఇంద్రియాధిపతినై ఉండగా వాడు వాటికి లోబడకపోవడం అసంభవం, ఎవ రక్కడ?"

"చిత్తం ప్రభూ!"

"అప్సరసాధి దేవత బ్రహ్మాణిని రప్పించండి."

"వారే మీ దర్శనార్థం వేచి ఉన్నారు ప్రభూ!"

"మా ఆగ్రహం కొంతైనా శాంతించింది. తక్షణ ప్రవేశం."

బ్రహ్మాణి వచ్చి సవినయంగా ఇద్దరికీ వేర్వేరుగా నమస్కరించింది.

"ఏవి టమ్మా - ఏమిటింత ఆలస్యం చేశారు?"

"క్షమించండి ప్రభూ! నివేదికలు మాకూ అందాయి. అత్యవసర సమయాల్లో తమ ఆజ్ఞలకు వేచి ఉండకుండా అప్సరసలను పంపే అధికారమూ ఇచ్చారు కానీ..."

"కానీ?!?" ఇంద్రుడు గద్దించాడు.

"రంభగారు ఏక వస్త్రగా ఉన్నారు."

"ఎన్నో రోజు?"

"మూడో రోజు. ఎల్లుండి గానీ అయిదో స్నానం కాదు."

"ఆదిలోనే అపశకునం. మిగతా వాళ్లంతా ఏమయ్యారు?"

"ఊర్వశిగారు సూర్యోపాసనలో ఉన్నారు. బట్టలు పెట్టించుకోవటానికి మేనకగారు పుట్టింటి గంధర్వ లోకం వెళ్లారు. ఈపాటికి రావలసింది."

"తిలోత్తమ?"

"వారు ఈశ్వర ప్రదక్షిణా దీక్షలో ఉన్నారు ప్రభూ!"

"పోనీ.. ఘృతాచి?"

"తన పొందుకి వప్పుకోనందుకు విశ్వకర్మ ఘృతాచికి ఇచ్చిన శాప కారణంగా భూలోకం వెళ్లి ప్రస్తుతం ప్రయాగలో తపన్సు చేసుకుంటూ ఉందని ఇదివరకే తమ కో నివేదిక పంపాము."

"ఇప్పు డెలా? ఇం కెవరూ లేరా? అమరావతికి అప్సరసలే కరు వయ్యారా? ఎంత శోచనీయం!"

"అప్సరసల అంతరంగిక సఖి అయిన రంజని మంచి ప్రాయంలో, నూతన యౌవనంలో, అత్యంత అధునాతనంగా ఉంది ప్రభూ! మీకు అభ్యంతరం లేకపోతే..."

"అవేమీ నాకు తెలియదు. ఆ తపస్విని ఓడిస్తారో, జయిస్తారో - ఇది మా ఆజ్ఞ!"

"శిరోధార్యం."

** ** **

'భూలోకం ఇలా ఉంటుందా?!? సూర్యుడు, చంద్రుడు - నదులు, కొండలు, చెట్లు, సెలయేర్లు - పక్షులు, ఈ పవన గమనాలూ అబ్బ! ఆనందో భూః'

ప్రత్యక్షానుభూతి పొందుతున్న రంజని పరవశించిపోయింది. అనుకుంది - 'పంచేంద్రియాల ప్రక్రియలే ప్ర-పంచంగా రూపు దిద్దుకున్న ఈ లోకంలో ఇంద్రియాల కెంత పండగ! మానవ మనో ప్రపంచానికి ఎంత అనుభవం! ఆనందం!

తాను చేరబోతున్న తాపసి మనసు ధ్యానము నుండి విడివడి తనని



కోపంతో కంపింప చేస్తుందేమోనని ఓ క్షణం అనిపించినా-

తన కర దర్పణంలో కనిపిస్తున్న అందమైన తన నాసిక కొన ఇస్తున్న ధైర్యంతో లోకాని కున్న కోపాన్నంతా జయించి తన దీర్ఘ నిశ్వాసంలో సగర్వంగా తేల్చేసినట్లు తేలిక పడింది.

తనకంటె గొప్పవారైన అప్సరాంగనల ఆలోచనలలో మునిగింది.

'రంభ నలకూబరుడి వలలో పడింది. ఊర్వశి పురూరవుడికి స్వంతం అయింది. మేనక విశ్వావసుడి కలల్లో విహరిస్తుంటుంది. ఇక చంద్రుడు కనపడితే చాలు - వళ్లే మర్చిపోతుంది తిలోత్తమ. పావం... ఘృతాచి గతి అలా అయింది. నే వెళ్తున్న కార్యం సఫలమైతే... ఓ దేవాంగన సఖి మరుక్షణంలో అప్సరస...'

అలా తలపోస్తున్న రంజనికి ఓ పావురాళ్ల జంట ఎగురుతూ ఎదురయితే - రంజని ఆపి పలకరించింది. "ఏవేంయ్ బాగున్నారా? ఏవిఁటీ కబుర్లూ?"

"కబుర్లకేం గానీ - మా పొదుగు జీవి మా కోసం ఎదురు చూస్తుంటుంది. వెళ్తాం" అంటూ ఆ తల్లిపక్షి రెక్కలతో రహస్యంగా తండ్రి పక్షిని గిరుతూ వెంట తీసుకెళ్లింది.

"అబ్బా - ఇంత లావు ఈపణా నీకే తగునమ్మా" అంటూ ఈసడింపుగా గొణుక్కుంది రంజని.

ఇంతలోనే...

తాను చేరవలసిన ప్రదేశం-

అది...

దట్టంగా గుట్టలు - పుట్టలు.

తన ఎదలో...

ఆ మొదటి కొత్తదనం పదునవుతున్న దడదడలు.

ఆ భయంలో పూర్తి మంత్రం గుర్తుకి రాక...

"తన్నో అనంగః ప్రచోదయాత్" - అంటూ పెదాలు కదిలాయి.


నేలమీద వాలింది.

వళ్లంతా ఓసారి చూసుకుంది.

విలాసంగా చేతుల్ని ఆకాశంలోకి విసిరేసింది.

నవ్వడి కాకుండా అడుగులు వేయిస్తున్న తన నడుము వేకువనే చిలికిన వెన్నలా వదిగి వదిగి...

ప్రకృతి పడిలోని నదిలా క్రిందికి దిగి...




సుకృతాల సూతికా పాదుల పెదాలను తడిపి...
ఆవేశంతో అతగాడి దర్శనం కోసం ఆ కొమ్మను వంచి చూసింది.

***అంతే !***

***నిర్ఘాంతపోయింది !***

అక్కడ కూర్చున్నది తపోధనుడే !
అతను పురుషుడే !

ఆ తపస్వీలో త నూహించిన మగసిరికి బదులు పాలలో వెన్నలా, శరీరంలోని చైతన్యంలా అప్పటి కది అనవసరమైనా - తప్పక ప్రస్ఫుటించే పసిబాలుడి పురుషత్వం స్ఫురించింది...

అప్సరస కావాల్సిన ఆ దేవాంగన అంతరంగం అమాంతం ఓ మాతృ రంగమై మూగవోయింది.

***"ఇంత మంచి పిల్లవాడికి తల్లినైతే ఎంత బాగుండును !" అంటూ ఎంతో తల్లడిల్లింది.***

మాతృక రోదించింది.
కళ్ళు వర్షించాయి.

కంటి రెప్పలు ఆర్పినపుడు ఆ ఆనంద, శోకమిశ్రిత బాష్పాలు ఆచ్ఛాదనలేని తన వక్షోజాల మీద పడ్డప్పుడు పిడుగులే అదిరి పడ్డాయో !

అంతక్రితమే...
మెరుపులే విరిగిపోయాయో !

** ** **

అంతా దద్దరిల్లింది.
అందులో అమరావతి ఒకటి.
ఇంద్రుడు అదిరిపడ్డాడు.
ఎదురుగా నిరృతి ప్రత్యక్ష మయ్యాడు.
"ఏమిటీ వైపరీత్యం?" ఇంద్రుడు భయంతోనే గద్దించాడు.
"స్త్రీ శక్తి ప్రభావం !"
"కర్తవ్యం?"
"వాత్సల్యం ! స్త్రీకి చూపవలసిన వాత్సల్యం ! వెంటనే స్త్రీకి ఓ వరం ఇవ్వండి !"
"నా కేం తోచడం లేదు, నిరృతీ ! నువ్వే చెప్పు. దిక్కు తోచడం లేదు."

***"అది రంజని సజల నయనాల ప్రభావం, ప్రభూ ! ఆలస్యం చేయకండి. శోకపూరితమైన స్త్రీ సజల నయనాలు నరకానికి దీపికలుగా శాసించండి. అదే వరం !"***

"తథాస్తు ! ఇంతకీ ఆ తాపసి ఎవరు?"
"ఈ క్షణంలోనే శ్రీమన్నారాయణుని ప్రత్యక్షం చేసుకుని ప్రసన్నం చేస్తున్న ఉత్తానపాదుని కుమారుడు, సునీతా ముద్దుబిడ్డ."
"ఇతన్ని గురించి ఇదివర కెపుడూ వినలేదే - పే రేమిటి?"
"అతని దింకా బాల్య ప్రాయమే !"
"ఆం అంత చిన్నవాడా ఈ తపస్వి?"
"అతనే ధ్రువుడు. మన లోకపాలకుల కిక ఆధారం అతనే !"
"అంటే?"
"భ్రమను భార్యగా స్వీకరించి శింశుమార చక్రంగా పిలవబడే లోక యంత్రానికి ఆధారమైన ఇరుసు లాంటివాడు ధ్రువుడు. ధ్రువో స్మమః."
"ధ్రువో స్మమః" ఇంద్రుడు అనుసరిస్తూ అన్నాడు.
"మరో మాట, దేవేంద్రా ! ఇరుసు అరిగిపోకుండా చక్రం సులువుగా తిరగడానికి అవసరమైన అంజనమే రంజని కన్నీరు. ఆ కందెన ఆడవారికి నేత్రా భరణమైన "కాటుక"గా వరం ప్రసాదించండి... అదే ఇక స్త్రీ నేత్రరంజని. పురుష హృదయ రంజని !"
"తథాస్తు" అన్న ఇంద్రుడికి జ్ఞప్తికి వచ్చింది - అనుకున్నాడు మనసులో - శచీదేవి కోరిక కూడా వృథా పోలే దన్నమాట.

** ** **

"రంజనీ ! నీ జన్మ ధన్యమైంది. ధ్రువకుమారుడి దర్శన క్షణాన కలిగిన నీ సంకల్ప శక్తి నిరంతరం నిన్ను ధ్రువునికి తల్లిలా చేసింది. ఆశీః"



"కోణవతి ఆశీస్సులకు నమస్సులు. కానీ... పురుష సంగమానికి తెరిచిన నా కన్నులు పుత్ర దర్శన భావంతో పులకించాయి. పూర్వానుభవం, ఉత్తరానుభవం రెండూ ప్రాప్తించలేదు కదా, ప్రభూ !"
"నీ ఆవేదన అర్థమైం దమ్మా - ఏదైనా వరం కోరుకో."
"ధ్రువ దర్శనంతో నా కోరికలన్నీ ప్రసన్న మయ్యాయి."
"నీ వినయం మరోసారి నిరూపించుకున్నావు. నీ అంతర్గతం అర్థమైంది. మరో సుమంగళమైన వరం తీసుకో - శృంగార పుత్రోత్సాహాలతో దంపతులు కాబోతున్న వధూవరులు - తమ చెక్కిలి మీద - దృష్టి దోష నివారణకూ, సకల మంగళ సౌభాగ్యాలకూ నీ ఉనికికి చిహ్నంగా కాటుక బొట్టును ఆభరణంగా ధరించి - నక్షత్ర మండలం దర్శించి నీ అభిమానానికి పాత్రులవుదురు గాక ! నేత్రరంజనీ - ఇది ధ్రువం !"
"ధన్యోస్మి. ధ్రువో స్మమః" ★